కామెడీ కథ

# డిజైనర్ గ్రాండ్ మదర్

**పెళ్ళికొచ్చిన జనాల్లో స్త్రీ జనాలని చూడ్డానికి రెండు కళ్ళూ చాలట్లేదు. కోకలు కట్టిన చిలకల్లా వయసుతో నిమిత్తం లేకుండా కలర్‌ఫుల్‌గా కళకళలాడిపోతున్నారు. ఆ జుట్లేమిటో, ఎన్ని రకాలుగా కత్తిరించుకున్నారో! నడుందాకా విరబోసుకున్న వాళ్ళు కొందరైతే, షార్ట్‌గా క్యూట్‌గా చెవుల్దాకానే బోయ్‌కట్లు చేయించుకున్న భామామణులు! శిగలు మాత్రం? చుట్టినచుట్టు చుట్టకుండా ఒక్కోళ్ళూ ఒక్కోరకం చుట్టల్చుట్టారు. పైగా చుట్టల్లో తళ్ళుకు తళ్ళుక్కుమంటూ రత్నాల్లాంటి రాళ్ళాభరణాలు కొందరు పెడితే ముత్యాలన్తలదన్నే పూసలింకొందరు. చీరకి మ్యాచింగ్ ప్లాస్టిక్ పూలు కొందరు. ఏకంగా సీతాకోకచిలుకల్నే ధమ్మిల్ల బంధాల్లో బంధించారు మరికొందరు.**

మాధవే గనక మగాడయ్యుంటే మహా ఎంజాయ్ చేసేదేమో సీను. కానీ మాధవి మగాడు కాక మగువైపోయిందికదా అంత సీన్లేకపోగా అంతా చూస్తుంటే చెప్పలేనంత దిగులు ముంచుకొచ్చింది.

స్టిఫ్‌గా స్ట్రైప్పులు పెట్టైన గద్వాల్ చీర వైపు చూసుకుంది. చాలా ఖరీదుగా ఉన్నా అస్సలు గాడీగా లేకుండా ఎంతో అందంగా ఉందని చెప్పి అప్పట్లో కొనుక్కుంది. అది కట్టే అవకాశం ఎప్పుడొస్తుందా అని చూసి చూసి ఇప్పుడీ వేళ్ళన్నీ విడిచేసిన మేనత్తమనవడి పెళ్ళికి కట్టుకొచ్చింది. ''చాలా బాగుందే ఎంతకొన్నావ్?'' అని ఒక్కళ్ళంటే ఒక్కళ్ళు కూడా అడగలా. ఇప్పుడు చుట్టూరా తళుకూ బెళుకూమంటూ రెపరెపలాడుతున్న చీరల్ని చూస్తుంటే తన చీర గంజిపెట్టి ఇస్త్రీ చేసిన పోలీసు యూనిఫార్మ్‌లా కనిపిస్తోంది తన కళ్ళకి తనకే.

ఇంక హెయిర్‌స్టయిలుకొస్తే, అదొక స్టైలా? తనకి ఊహ తెలిసినప్పట్నుంచీ వేసుకుంటున్న ఆ జడే ఇంత పొడుగ్గా కొరడాలా. తను ఎస్సెస్సెల్సీ చదివే రోజుల్లో పొడుగాటి సింగిల్ జడకి గుర్తింపుండేదేమోగానీ ఆ నెక్స్టియరే ఎస్సెస్సెల్సీలూ పీయూసీలూ పోయి టెన్తులూ ఇంటర్లూ వచ్చేసి ఇంకా పైపెచ్చు ఎమ్‌సెట్లూ, జెఇఈలు, కేసెట్లూ, ఈ సెట్లూ, ఆ సెట్లూ వరదలా తన్నుకొచ్చేసరికి ఫ్యాషన్ ప్రపంచం గట్లు తెగిపోయాయి. ఇవాళ ఏ గుర్తింపూలేని ఈ వాలుజడని చూసుకుంటుంటే మాధవికి విరక్తి రక్తపోటులా పెరిగిపోయింది.

పైగా బ్లాక్ మెటల్‌లో బిద్రీసిల్వర్ ఇన్‌లే వర్క్‌లా ఈ తెల్లవెంట్రుకలొహటీ! రామచంద్రా!

''ఎవరు నేర్పేరమ్మ ఈ జుట్టుకీ<br>
నెరిసిపొమ్మనీ పాయపాయకీ''

అని విషాదంగా పాడుకుంది మాధవి.

మళ్ళీ తలెత్తి కనిపించినంతమేరా అన్ని మెడల్లోనూ నగలు పరకాయించి చూసింది. అందరూ డిజైనర్ జ్యూయెల్రీలే. అవేమిటో కనిష్కుడో తురుష్కుడో ఆ గొలుసులు, నక్షత్రాల్లి రవ్వలు కావుట! అల్లాంటి డైమండ్సూ, గాజులే గానీ చక్కిలాల్లా గుండ్రంగా లేకుండా స్క్వేర్లూ, రెక్టాంగిల్సూ, హెక్సాగాన్సూ ట్రెపీజియములూ ఒకటేమిటి? ఒక్క సర్కిల్ తప్ప అన్ని షేపుల్లోనూ ఉన్నాయి. అవి చేతులకి తొడిగేసుకుని టిప్పూటాపూమంటూ తిరిగేస్తున్నారు.

ఓ పిల్లని పిలిచి ''ఇవేమిటే? స్టైయిన్‌లేస్ స్టీలు గాజులెత్తొడుక్కున్నావూ? తప్పమ్మా. శుభం కాదు'' అని చెప్పబోయింది. ఆ పిల్ల ముందుకు పడి కాసేపూ వెనక్కి విరగబడి కాసేపూ తెగ నవ్వేసింది. ''ఇవి స్టీలు కాదు గ్రాండ్‌మా! ప్లాటినమ్ ప్లాటినమ్'' అని చెవిటి వాళ్ళ ముందు శంఖం ఊదినంత గట్టిగా చెప్పేసి చక్కాబోయింది. 'ఓసి దీని పొగరు దొంగలెత్తోలా' అనుకోలేకుండా ఉండలేకపోయింది మాధవి.

తన చెవులకున్న రవ్వల దుద్దులోసారి తడుముకుని నిట్టూర్చింది.

''మా నాయనమ్మా, ఆవిడ తల్లిగారూ, మా తల్లిగారూ, ఆవిడ తల్లిగారూ తరతరాలుగా అందరూ ఇలాంటివే కట్టించుకున్నారు'' అంటూ భర్త గోవిందం ఇడ్లీ పళ్ళాల్లాంటి రవ్వల్దుద్దుల జత కొనిపెట్టాడు.

''సౌతిండియన్సందరూ ఇలాంటి మోడలే లైక్ చేస్తారు మాజీ'' అంటూ షాపుసేఠు ఇవంటగట్టి యాభై వేల్లాగాడు.

''ఏవిటో! కట్టించుకోడంట కట్టించుకోడం. పళ్ళు కట్టించుకున్నట్టు. అక్కడికి తనేదో సౌతిండియన్ కాక వెస్టిండియన్నైనట్టు!'' కోపంగా తిట్టుకుంది మాధవి మొగుడ్నీ షాపువాడ్నీ కలిపి.

''రవ్వలా ఇవి కావు<br>
చెవిలోన పువ్వులూ<br>
రవ్వంత గ్లామర్లేని<br>
బంగారాళ్ళ ముద్దలూ''

అని పేరడీ సాంగ్ పేథటిక్‌గా పాడుకుంది.

''ఇలా పేరడీ సాంగులు కట్టుకుంటూ ఈ శేష జీవితం ఇలా గడపాల్సిందేనా? ఖర్మవిటో! ఖర్మవిటో'' సుదీర్ఘంగా నిట్టూర్చింది.

ఇహ ఇదికాదు పని అని అటూ ఇటూ చూసింది. ఓ ముదురాకు పచ్చచీర ఆకర్షించింది. ఆ చీరనిండా స్ప్రింగులు స్ప్రింగులుగా వానపాము చుట్టల్లాంటి చమ్కీలేవేవో కుట్టున్నాయి. అవేమిటో తనకెలాగూ తెలియదు. తనకున్నవన్నీ పాత రాతియుగంలో పాతజరీ యుగం నాటి చీరలు. ఇప్పుడీ స్ప్రింగు యుగం నాగరికతలో తయారైన చీర తను కొనుక్కోవాలంటే దాని పేరేంటో కనుక్కోవాలి.

''అమ్మామ్మయ్ అమ్మాయ్మాయీ! ఇలారా'' స్ప్రింగుల చీరావిడ్ని పిలిచింది.


ఆ 'అమ్మాయి' దగ్గరగా వచ్చి కళ్ళు చిట్లించి కళ్ళజోడులోంచి చూస్తూ ''ఓసి! నువ్వటే మాధవం?'' అంది జిగేల్మని మెరిసిపోతున్న ప్లాస్టిక్ పళ్ళు ప్రదర్శించి నవ్వుతూ.

''ఓసి ఓసి ఓసి! నువ్వటే సుబ్బులూ! ఈ బాబ్డ్‌హెయిరేవిటే, ఈ స్లీవ్‌లెస్సేవిటే? ఈ తళుకూబెళుకూ చీరేవిటే! ఎవరో కుర్రపిల్లవనుకున్నా వెనకనించేస్మి!'' అంది మాధవి.

''ఆ.. లోకం మారుతూంటే లోకంతోపాటు మనవూనూ. ప్రపంచంలో అందరూ స్మార్ట్‌గా తయారైపోతుంటే మనవెందుకు వెనకబడాలీ? మనకేం తక్కువా? మనరోజుల్లో మనం మాత్రం చదవలేదేంటీ ఎమ్మేలూ ఎమ్మెస్సీలూ? పిల్లవెధవల్ని చూసే వాళ్ళు లేక ఏడ్చిపోతారన్చెప్పి ఆ నౌకరీ ఒక్కటీ చెయ్యలేదుగానీ మనం మాత్రం మోడర్న్ కావేమిటే?'' అంది సుబ్బులు. తరువాత ఇద్దరూ కాసేపు కళ్ళముందు రింగులు

రింగులు తెప్పించుకుని ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్ళిపోయారు. పిల్లలూ ప్లస్ మొగుళ్ళూ (ఇద్దరికీ చెరో కరేలెండి) కోసం జీవితాల్నెలా హారతి కర్పూరాల్లాగా హరించేసుకున్నారో గ(త్రాలన్నీ తిరగదోడుకున్నారు. బాగా చింతించారు.

మళ్ళీ గడియారాలు గిరగిరా తిప్పుకుపోయి, కాలెండర్ చీటీలు వాటంతటవే స్పీడుగా చిరుక్కుపోయి



ఫ్లాష్ ఫ్రంట్లోకొచ్చేసాక,

''అవునుగానీ ఈ చీరేమిటీ ఇల్లా వానపాముల్లాంటి స్ప్రింగులు దీనిమీదికెలా వచ్చాయి?'' అనడిగింది మాధవి.

''వానపాములూ కాదు, బోదురుకప్పలూ కాదు నువ్వు మరీనూ. ఈ ఎంబ్రాయిడరీని జర్దోసీ అంటారు. చీరేమో ప్యూర్ జార్జెట్టే వెర్రి మొహమా'' అని జ్ఞానోపదేశం చేసింది సుబ్బులు.

''ఓహో చిన్నతనంలో జార్జెట్ ఓణీ తీసుకునే వాళ్ళం..'' మాధవి మాట పూర్తి కాకుండా నోరు మూసేసింది సుబ్బులు కంగారుగా.

''గట్టిగా అరవకే బాబూ. మొన్నో రోజో పిల్ల-అంటే మా కోడలు పిల్లకి చెల్లెలేలే- 'సినిమాల్లో అమ్మాయిల్లా ఆ పరికిణీలూ ఓణీలూ వేసుకుని గ్లామరస్‌గా సెక్సీగా తయారై కాలేజీలకెళ్ళేవారా మీరాంటీ? ఛీ యాక్కు డోక్కు' అనేసిందేవ్. తనేసుకున్న జీన్సూ, టీ షర్టూ మహాపతి(వ్రతల్లప్ప ఇంకెవరూ వేసుకోరన్నట్టు! అంచేత మనం ఆ కాలపు డ్రెస్సు మెన్షన్ చెయ్యకపోతేనే ఈ గుంపులోంచి మర్యాదగా బయటపడగలం'' అంది.

''పోన్లేగానీ సుబ్బులూ నువ్విలా పొట్టాగిట్టా రాకుండా లావూగీవూ ఎక్కకుండా సమంగా ఎలా ఉన్నావే ఈ వయసులో కూడా?'' సుబ్బుల్ని గురువుగా భావించి జ్ఞానార్థియై మళ్ళీ ప్రశ్నించింది మాధవి.

ఈసారి సుబ్బులు సుదీర్ఘంగా నిట్టూర్చింది. ''రెణ్ణెల్లక్రితం వరకూ నీకు మూడు రెట్లు మాత్రమే సర్కమ్‌ఫరెన్స్ ఉండేది నాకు. అలా ఉంటూండగా మా ఇంటి పక్కింటమ్మాయి 'వెయిట్ తగ్గేందుకు వెయ్యి వైద్యాలు' అనే కోర్సు చదివొచ్చింది'' ఎఫెక్టు కోసం ఆగి మళ్ళీ నిట్టూర్చింది సుబ్బులు.

''అదేం కోర్సే వెర్రి వేయి విధాలన్నట్టు వినిపిస్తోంది!'' అంది మాధవి సందేహంగా.

''అదే మరి. మనకి వెర్రి, ఆ పిల్లకి వేలకి **వేలు!** సరే విను మరీ. ఆ పిల్ల కోర్సు చేసొచ్చి గుమ్మానికి బోర్డుకట్టి ఇంట్లోనే ప్రాక్టీసు పెట్టు**కుంది.** మంట చేత ఆకర్షించబడ్డ శలభప్పురుగులా 'వెయిట్ తగ్గించబడును' బోర్డుకి నేనాకర్షించబడి పక్కిల్లే కదాన్చెప్పి ఆ పిల్ల దగ్గరకెళ్ళా. ఇలా డాక్టరేమో బరువు తగ్గమంటున్నాడు, అత్తగ్గితే తప్ప కీళ్ళనొప్పులూ బీపీలూ గట్రా తగ్గవంటున్నాడూ అని మొరెట్టుకున్నా. 'మీకెందుకు నాదీ భారం మీరేం వర్రీకాకండి గ్రాండ్ మమ్మీగారూ!' అని తనకొచ్చిన విద్యంతా నామీద ప్రయోగించి నాకీ స్థితి తెప్పించింది'' సుబ్బులు మళ్ళీ ఆగి, మళ్ళీ నిట్టూర్చింది.

''బానే వుందిగా. చక్కగా ఉన్నావుకదా నిట్టూర్పులెందుకు?'' ఆగలేక మళ్ళీ అడిగింది మాధవి.

''బరువు తగ్గడం బానే ఉంది. వారానికి రెండు వేలు చొప్పున ఫీజు వేసి ఎనిమిది వారాలకి బిల్లిచ్చిందే తల్లీ. ఇంకొక్క వారం ట్రీట్‌మెంట్ మిగిలింది మానిపించకండి గ్రాండ్‌పా అని మా ఆయనక్కూడా ఎక్కించింది వెర్రి. ఈ ఫీజు దిగుల్తో బరువు తగ్గడమే కాదు, జిహ్వ కూడా చచ్చింది. ఇంక బతికుండగా బరువెక్కను'' లెంపలేసుకుంది సుబ్బులు.

మాధవి ఆలోచనలో పడింది. 'ఈ పాత గెటప్ పోయి కొత్త కొత్తగా స్టైలు స్టైలుగా కనిపించాలంటే కొంత డబ్బు ఖర్చు తప్పదన్నమాట! అమ్మాయి నుంచి అమ్మ, బామ్మ పాత్రలు పోషిస్తూ ఇతరులకే ఇంపార్టెన్సిస్తూ బతికిందిన్నాళ్ళూ. జన్మలో తనకోసం తను ఓ పది రూపాయలు ఖర్చుపెట్టుకుంటే ఏం? మిన్ను విరిగి మీద పడుతుందా?

**పోడూరి కృష్ణకుమారి**

పడితే పడనీ పడ్డప్పుడు చూద్దాం' ఓ నిశ్చయానికొచ్చేసింది.

మాధవి కాలక్షేపం కోసం కిటికీ షాపింగులేసేటప్పుడు కనిపించే బ్యూటీపార్లర్ బోర్డులమీద ఓ కన్నేసుంచడం అలవాటేసుకుంది. 'మెహందీ బ్యూటీక్లినిక్' అన్న బోర్డున్న గుమ్మంల్లోంచి కనిపిస్తున్న బూందీలాంటి పిల్లన్చూసి 'హిందీలో మాటాడాలేమో. ఎందుకొచ్చిన బెడద' అనుకుని దాటేసింది. 'స్మార్ట్ లుక్స్' పేరు చూసి 'లోపల వాళ్ళేం బొట్లేరు ముక్కలు మాటాడ్తారో ఏమో విన్లేక చావాలి. గ్రామర్ తెలీని వాళ్ళు గ్లామరేం ఇస్తార్లెద్దూ' అనుకుని ఆ గడప తొక్కలేదు. అసలే చిన్నతనంలో 'బాలవ్యాకరణం'తోపాటు 'రెన్ అండ్ మార్టిన్' కూడా ఔపోసన పట్టేసిన ఘనాపాటీ ఆయె!

'అందం బ్యూటీ పార్లర్' అన్న పేరు నచ్చింది. 'కాకికేకో తేడా తెలీని హిందీ, యస్ నో ఆల్ రైట్ ఇంగ్లీషూ కాకుండా నాలుగు తెలుగు ముక్కలు మాటాడుకోవచ్చు' సంబరపడి లోపలకెళ్ళింది. వివరాలన్నీ తెలుసుకుంది. రోజుకో ట్రీట్‌మెంట్ తీసుకుంటూ తెగ రెచ్చిపోయింది.

పెళ్ళిళ్ళ సీజనసలే. ఒకరోజు ఒకేరోజు రెండు పెళ్ళిళ్ళొచ్చాయి. 'దిసీజ్ ద ఛాన్స్!' మాధవి విజృంభించింది.

పెళ్ళిళ్ళకెళ్ళాల్సిన రోజు రానే వచ్చింది. ''నాకు షాపింగుంది. నేన్చేసుకుంటుంటాను. మీరు పదకొండింటికల్లా ఫలానా చోటికి రండి. నేనూ ఆ టైమ్‌కి అక్కడికే వస్తాను'' పెర్రీమాసన్ పెర్సనల్ సెక్రటరీ లెవెల్లో ఇన్‌స్ట్రక్షనిచ్చింది భర్త గోవిందానికి. చకచకా నడుచుకుంటూ ఇంట్లోంచి బయటపడింది.

'అందం బ్యూటీ పార్లర్'లోకెళ్ళింది. సరిగ్గా పదకొండింటికల్లా బయటకొచ్చి చూసింది. సరైన సమయంలో సరైన చోట్లో గోవిందంగారి కారుందా లేదా అని చూసింది. బ్యూటీపార్లర్ ఎదురుగా రోడ్డుకటువైపు కారు పార్క్ చేసుంది. 'ఇప్పుడు చూడాలి తమాషా' సంతోషంగా గర్వంగా రోడ్‌క్రాస్ చేసింది.

మాధవి చిన్నతనంలో ఇంటిల్లిపాదీ కలిసి తెలుగు సినిమాలు తెగ చూసేవారు. ఓ సినిమాలో హీరో సినిమా సగం నుంచీ మారువేషంలోకి మారిపోతాడు. అంటే ఏం లేదు. అప్పటివరకూ వేసుకున్న తెల్లచొక్కాలూ ప్యాంటుల్లూ మానేసి బాగా టైట్‌గా ఉన్న నల్లప్యాంటుల్లూ, నల్లటి పొడుగాటి చేతులున్న టైట్ చొక్కాలూ వేసుకోవడం మొదలెడతాడు హిందీ సినిమాల్లో దేవానందల్లే. నల్లకళ్ళజోడు ఎల్లవేళలా ధరించి చీకట్లో దూసుకుపోతుంటాడు. హాల్లో నేల ప్రేక్షకుడి దగ్గర్నుంచి, నల్లుల బాల్కనీ వాళ్ళ వరకూ అన్ని టిక్కెట్ల వాళ్ళూ 'అయ్యో, వీడిందాకటి హీరోనే' అని గుర్తుపట్టేసి భలే నవ్వేసుకుంటున్నా కూడా పాపం హీరోయిను మాత్రం అస్సలు గుర్తుపట్టదు. ఆఖరు సీన్లో ఫైటింగులేసేటప్పుడు విలన్ కొట్టిన దెబ్బకి గాగుల్స్ అంత దూరం ఎగిరిపడ్డాకగానీ గుర్తుపట్టలేకపోతుంది.

అలా ఈ క్షణంలో తన కథ కూడా క్లైమాక్సుకొచ్చేసిందనుకుంది మాధవి. ఉత్కంఠతో ఊగిపోతూ రోడ్డివతల్నుంచి అవతలకి సేఫ్ల్యాండింగ్ చేసాక కారు పక్కనుంచి హైహీల్స్ టిక్కుటక్కులాడించుకుంటూ కారు దాటి ముందుకు నడిచింది.

స్కైబ్లూ జార్జెట్ మీద జర్దోసీ కుట్లు, పగలే తారలు మెరుస్తున్న ఆకాశాన్ని చీరగా కట్టేసుకున్నట్టుంది. చీరా జాకెట్టూ నడుమ కనిపిస్తున్న నడుము కాస్త ఒల్లైనా గోల్డులా మెరుస్తోంది. వెన్నెల్లో వెండి అంచులు సంతరించుకున్న నల్లమబ్బుల్లాంటి కురులు గాల్లో అలా అలా అలల్లా తేల్తున్నాయి. లైట్ మేకప్ ఇవ్వబడ్డ గులాబి రంగు ముఖారవిందంపై 'మారువేషం' కంప్లీట్ చెయ్యడానికి గాగుల్స్!

తెచ్చిపెట్టుకున్న స్టైలుతో కారు దాటి నాలుగడుగులు వేసిందో లేదో, వెనకనించి-

''బామ్మా! బామ్మోయ్!'' మనవడి పిలుపు వినబడింది.

ఎలా ఉన్నదలాగే బిగుసుకుపోయింది మాధవి!

పరుగెత్తుకుంటూ వచ్చి ''బామ్మా! మన కారిక్కడే వుందీ. మర్చిపోయావా? ఎక్కడికెల్తున్నావ్?'' చెయ్యి పట్టుకుని ఊపేసాడు చిన్నిగాడు.

తేరుకుని, ''అర్రరె! చూళ్ళేదురా'' అంటూ వాణ్ణెత్తుకుంది.

'అయితే ఇంతా ఖర్చుపెట్టీ నాలో మార్పేం లేదన్నమాట!' ఆశ్చర్యపోయింది. మరీ గుర్తుపట్టలేనంతగా మారిపోనందుకు కాస్త సంతోషం కూడా వేసింది. 'ఇంతలోనే మారిపోతాననుకోడం ఉత్త భ్రమ. కాకపోతే కాన్ఫిడెన్స్ మాత్రం ఖరారుగా పెరిగింది' ఆనందంగా అనుకుంది.




కార్లో కూచున్నాక మాధవి జుట్టు చేత్తో పట్టుకుని చూస్తూ, ''బామ్మా! చ్ఛవరం అబ్బాయి తలంటు కూడా పోసాడా?'' అనడిగాడు చిన్నిగాడు. బామ్మ కూడా తనలాగే 'చ్ఛవరం అబ్బాయి' దగ్గరకెళ్ళి జుట్టు కత్తిరింపించుకుందేమోనని ఊహిస్తూ.

''అవున్నాయనా చేయించుకునే వాళ్ళుంటే క్షవరమూ చేస్తారు. పోయించుకునే వాళ్ళుంటే తలంట్లూ పోస్తారు వేలకి వేలుచ్చుకుని'' కచ్చిగా అన్నాడు గోవిందం ఈవిడెంత ఖర్చుపెట్టుంటుందా అని మనసులో ఓవరెస్టిమేట్ చేసుకుని మనసులోనే గుండెలు బాదుకుని, బట్టతల మీద జుట్టున్నట్టూహించుకుని దాన్ని పీక్కుంటూ, 'రవ్వలగాజుల్లో రాళ్ళ నెక్లెసుల్లో అయితే అర్థం చేసుకోచ్చు, పడుంటాయి తరతరాలు. కావాల్సినప్పుడు క్యాషవుతాయి కూడా. ఈ అంటకత్తెర్లకీ చమ్కీలకీ డబ్బెందుకు పొయ్యాలీ?' అన్నది గోవిందం రీజనింగు.

గోవిందం ఫ్లాపు మొహం పెట్టేపెట్టాడుగానీ పెళ్ళిలో మాధవి మాత్రం గొప్ప హిట్టయిపోయింది. ''ఎంతైనా మాధవి మాధవే. మనవడ్నెత్తినా మహా లేటెస్టుగా ఉంటుంది'' ఆడాళ్ళంతా అభినందించారు.

''ఆ.. మా గోవిందం అన్నయ్య స్పాన్సర్ చెయ్యబట్టి మాధవొదిన అలా వెలిగిపోతోంది'' అంటూ వరస చెల్లెళ్ళు కొందరు గోవిందాన్నీ అభినందించారు.

మొహమాటానికి 'హి హి'మని నవ్వినా గోవిందం కుళ్ళుకుపోయాడు.

ఆ రోజు రాత్రి ''నువ్వంత ఖర్చుపెట్టి ఆ మేకప్పులన్నీ చేయించుకుంటే మేం ఎవ్వరం గుర్తుపట్టలేనంత చిన్నదానివీ అందగత్తెవీ అయిపోతావనుకున్నావు కదూ?'' అనడిగాడు గోవిందం ఇంకా కోపం తీరక.

''కాదు'' అంది ముక్తసరిగా మాధవి.

''మరెందుకో?'' అడిగాడు.

''మీ అందర్నీ ఇంప్రెస్ చెయ్యాలని కాదు. నా ఆత్మానందం కోసం. కొత్తదనం ఏదున్నా అదేవిటో తెలుసుకోవాలన్న నా ఆసక్తిని తృప్తి పరచడం కోసం'' స్పష్టంగా చెప్పింది.

అప్పుడు గోవిందం దగ్గర మాధవీదా జవాబ్ నహీ.